క్లుప్తంగా

బషీర్ బాబా దర్గాలో ప్రత్యేక పూజలు

రెడ్డిపాలెం(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలు పంచాయితీ రెడ్డిపాలెం సెంటర్‌లో గల బషీర్‌బాబా ఆశ్రమంలో మంగళవారం బాబా 18వ గంధోత్సవాన్ని(ఉరుసు) వైభవంగా నిర్వహించారు. బషీర్ బాబా వారి గంధోత్సవాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు ఆయన శిష్య బృందం సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి పూజలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలిలో మంగళవారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆదిత్య హృదయం, విష్ణు సహస్రనామ పారాయణలు జరిగాయి. గీతా కర్పూర యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు బండి వెంకట్రావు, చుండూరు గోపాల కృష్ణ, కోట సంధ్యారాణి, బూర్లె రాజరాజేశ్వరి, కె.సుబ్బమ్మ, వై.సూర్యప్రభ, డి.శశికళ, ఎం.గృహలక్ష్మి, పి.నిర్మల, బి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

జంపని(వేమూరు): భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ చెన్న కేశవ స్వామివారి దేవస్థానంలో మంగళవారం వార్షిక ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైఖానస అగమ శాస్త్రం ప్రకారం ఉదయం సుప్రభాత సేవ, అనంతరం సహస్ర అష్టోత్తర శత నామాలతో తులసి దళార్చన నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించారు. తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ నిర్వహించారు. భీష్మ ఏకాదశి విశిష్టతను పండిత ఎం శ్రీనివాస మూర్తి భక్తులకు వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని విష్ణు ఆలయాలు, రామ మందిరాల్లో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసిన పొలాల పరిశీలన



తెనాలిటౌన్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించి ఈ కెవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. రూరల్ మండలం నేలపాడు, బుర్రిపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు ఈ క్రాప్ నమోదు చేస్తున్న పొలాలను సందర్శించి, నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రైతులు తమ పొలాలను ఈ క్రాప్ చేయించుకుని ఆర్‌బీకేలలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ జాబితాలో ఉండి ఆధార్‌కు బ్యాంకు ఖాతా లింక్ కానీ వారు బ్యాంకు మేనేజర్‌ను కలిసి ఆధార్‌కు బ్యాంకు ఖాతాను నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఈ కెవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జి.మోహన రావు, వీఏఏలు కె.హర్షిష్‌వర్మ, పి.దీప్తి, రైతులు పాల్గొన్నారు.

మురుగు పారుదల జరిగే విధంగా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 34వ వార్డులో మంగళవారం ఆమె, కమిషనర్ బండి శేషన్నతో కలసి పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ఉదయం పర్యటించడం జరుగుతుందన్నారు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వాటిని బాగు చేయించేందుకు కనీసం రెండు, మూడు రోజులు పడుతుందని చెప్పారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చెత్తను కాల్వల్లో వేయవద్దని సూచించారు. వారి వెంట కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, తదితరులున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- వలంటీర్లకు అవార్డులు, నగదు అందజేత



అశోక్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వలంటీర్ రేణుకమ్మ

అమర్తలూరు(వేమూరు): సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర మరువలేనిదని నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలో పనిచేస్తున్న 237 మంది వలంటీర్లకు గానూ ఐదుగురికి సేవారత్న అవార్డులు అందజేశారు. 227 మందికి సేవామిత్ర అవార్డులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిరంగిపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 9 మంది వలంటీర్లకు అవార్డులు అందజేశారన్నారు. వీరిలో వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామానికి చెందిన వలంటీర్ మంద రేణుకమ్మ ముఖ్యమంత్రి చేతుల మీదగా సేవా రత్న అవార్డు అందుకోవడం అభినందనీయమని అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు, ఫించన్లు పంపిణీలో వలంటీర్లు చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుర్తించి ప్రతి ఏడాది వలంటీర్లుకు అవార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 227 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ దేవర కొండ రాము, మండల పార్టీ అధ్యక్షులు యలవర్రు సురేష్, బొట్టు మోషే, ఏ రామ్మోహనరావు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల మైనార్టీ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ హుస్సేన్, మండల ఉపాధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

భట్టిప్రోలు: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మార్కెట్ యార్డులో వలంటీర్లను సన్మానించే కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హాజరవుతారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. వైఎస్సార్‌సీపీ వేమూరు జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామ సర్పంచులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మైనార్టీ నేత సిరాజుద్దీన్



తాడేపల్లిలో సిరాజుద్దీన్‌కు పార్టీ కండువాను కప్పుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన టీడీపీ మైనార్టీ సెల్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్, పంచాయతీ 4వ వార్డు సభ్యురాలు సయ్యద్ మునీరా, మరో 15 మైనార్టీ కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలోకి చేరారు. బాపట్ల జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి సమక్షంలో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన చేతుల మీదగా పార్టీ కండువాలు కప్పుకున్నారు. భట్టిప్రోలుకు చెందిన మరికొందరు ముస్లిం మైనార్టీ సోదరులు వరికూటి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు సమక్షంలో పార్టీలో చేరారు.

తాడేపల్లికి తరలిన టీడీపీ శ్రేణులు

- పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు ఏర్పాట్లు
- నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి ఆధ్వర్యంలో వాహనాల్లో తరలింపు



బస్సులో తాడేపల్లికి వెళుతున్న మహిళలతో డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: వైఎస్సార్‌సీపీపై నమ్మకంతో పార్టీలోకి చేరుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని బొర్రావారిపాలెంకు చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బొర్రా వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాలపై భారీ ర్యాలీతో గుళ్లపల్లి లోని డాక్టర్ ఈవూరి గణేష్ క్యాంపు కార్యాలయానికి మంగళవారం చేరుకున్నారు. అనంతరం వారంతా ఈవూరితో కలిసి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి తరలి వెళ్లారు. నగరం మండలం అద్దంకివారిపాలెం, సిరిపూడి, నిజాంపట్నం మండలం ప్రజ్ఞాం, రేపల్లె రూరల్ మండలం పేటేరు, గుళ్లపల్లి గ్రామాల నుంచి గౌడ సంఘీయులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలివెళ్లారు.

వైఎస్సార్‌సీపీలోకి వంద కుటుంబాల టీడీపీ మద్దతుదారులు చేరిక

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో తాడేపల్లికి తరలింపు



వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో తాడేపల్లికి తరలి వెళ్లేందుకు చేరుకున్న టీడీపీ శ్రేణులు

అమర్తలూరు(వేమూరు): టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పలువురు కార్యకర్తలు చేరారు. వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో తాడేపల్లికి తరలివెళ్లేందుకు వీరంతా అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో గల వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు, బాపట్ల, పల్నాడు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వేణుంబాక విజయసాయి రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు మంగళవారం తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 100 కుటుంబాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. భట్టిప్రోలు మండల కేంద్రంలోని ముస్లింలు, అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన బీసీలు, చుండూరు మండలంలోని మండూరుకు చెందిన పలువురు బీసీ కులస్తులు 100 వాహనాలతో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నాటికల పోటీలు



భానుమతి, కుర్రా శ్రీనులను సత్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు



క్షేత్రం నాటికలో సన్నివేశం

- సేవా రంగ ప్రముఖులకు ఆత్మీయ సన్మానం
- ప్రేక్షకులను ఆలోచింపజేసిన క్షేత్రం నాటిక

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత బసవరాజు జయశంకర్ పర్యవేక్షణలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి 'బహురూపి' నాటికను ప్రదర్శించారు. శిష్టా చంద్రశేఖర్ రచించిన ఈ నాటికకు కె.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు.

పట్టణంలో సేవా రంగ ప్రముఖులు అయిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి చైర్మన్ ఉమ్మలనేని భానుమతి, శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీనులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం' నాటికను ప్రదర్శించారు. శిల్ప ఆకురాతి రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. సాంఘిక నాటక రంగంపై సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ నాటక రచయితలు డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, ఆకురాతి భాస్కర్ చంద్రలు సమీక్ష జరిపారు. అనంతరం తృతీయ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి 'అజరామరం' నాటికను ప్రదర్శించారు. హరిబాబు జెట్టి రచన, దర్శకత్వం వహించారు. మూడు నాటికల పోటీల కళాకారులకు ప్రదర్శన పారితోషకాన్ని ప్రణాళిక శాఖ ఉప కార్యదర్శి ఎ.వి.సుబ్బారావు, కావూరి సత్యనారాయణలు అందజేశారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు, కళాకారుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తదితరులు పర్యవేక్షించారు.

వచన కవితల పోటీల్లో విజేతల ఎంపిక

బాపట్ల: రాష్ట్ర స్థాయి వచన కవితల పోటీల విజేతలను రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ మంగళవారం ప్రకటించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా రచయితల సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల, బత్తుల సర్వీస్ ట్రస్ట్ చీరాల సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వచన కవితల పోటీలలో విజేతలను అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయ్ కుమార్ ప్రకటించారు. ప్రథమ బహుమతిని జి.రామచంద్ర రావు (చెరుకుపల్లి), ద్వితీయ బహుమతిని చుండూరు శేషమాంబ (గుంటూరు) గెలుచుకోగా తృతీయ బహుమతులను హైమావతి సత్య (తణుకు), చెన్నాప్రగడ శర్మ (విజయవాడ) పొందినట్లు చెప్పారు. కరిపే రాజ్ కుమార్ (నిర్మల్), నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిలు (కొలకలూరు) ప్రత్యేక బహుమతులను, లీల కృష్ణ (తెనాలి), లేదాళ్ల రాజేశ్వరరావు (లక్సెట్టిపేట) ప్రోత్సాహక బహుమతులను పొందారని వారు వివరించారు. విజేతలకు బహుమతులను ఈ నెల 21న రోటరీ కల్యాణ మండపంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహూకరించనున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొల్లూరు : పేకాడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని చిలుమూరు సమీపంలోని పంట పొలాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు కొల్లూరు ఎస్‌ఐ రవీంద్రరెడ్డికి అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ. 2,550లు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గణపతి స్వామి ఆలయ ధర్మకర్త శేషగిరిరావు మృతి




వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు (92) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం రాత్రి స్వగ్రామమైన వెల్లటూరుకు ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువతి అదృశ్యం



పెదకాకాని: మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పెదకాకాని సుందరయ్యకాలనీకి చెందిన షేక్ నన్నీబి మస్తాన్ దంపతులకు నలుగురు సంతానం. వారిలో మూడో కుమార్తె షేక్ రంజాన్‌బీకి చిన్నతనం నుంచి మతిస్థిమితం లేదు. చిన్నపిల్లలాగా ఇంటి పక్కల ఉన్న వారితో ఆడుకుంటూ ఉంటుంది. సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కాలనీలో కనిపించలేదు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో విచారించినప్పటికీ ఆచూకీ కనిపించలేదు. దీంతో రంజాన్‌బీ తల్లి నన్నీబీ పెదకాకాని పోలీసులను ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

కనుల పండువగా స్వామి కల్యాణం



కాకుమాను: స్థానిక గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

ఓటు విలువపై అవగాహన

గుంటూరు రూరల్: ఓటు నమ్మకమైన నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రజలకున్న వజ్రాయుధం ఓటు హక్కు అని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం ఏఏన్‌యూ, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు లాం గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వలంటీర్ల సేవలు ఎనలేనివని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేకువజాము నుంచి నిద్రపోయే వరకు ప్రజాసేవ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ పలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళుతూ అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తున్నారన్నారు. అటువంటి వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి సత్కరించటం అభినందనీయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రేపల్లె పట్టణ, రేపల్లె మండలం, నిజాంపట్నం మండలాల్లోని వలంటీర్లు ఏడుగురికి సేవా వజ్ర, 15 మందికి సేవారత్న, 820 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణ మూర్తి, గాదె వెంకయ్యబాబు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కూచినపూడి మార్కెట్‌యార్డు చైర్మన్ పందరబోయిన బసవపున్నయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు బుధవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో శ్రీనివాస మూర్తి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు హాజరవుతారని పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయకులు, అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌కుమార్



స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రశాంత్‌కుమార్

రేపల్లె రూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు. మెప్మా అర్బన్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటరులో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు వస్తువుల స్టాళ్లను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం పావలావడ్డీ రుణాలతో పాటు మహిళా మార్టుల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. సంఘాలలోని సభ్యులు వారు సొంతంగా తయారు చేసిన వస్తువులను అర్బన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. దీని వల్ల సభ్యుల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సీఎంవో విజయ, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎన్నికల ఓటరు జాబితాలు విడుదల



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న వసంతరాయుడు

వేమూరు: సార్వత్రిక ఎన్నికల ఓటరు జాబితా విడదల చేయడం జరిగిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు వెల్లడించారు. నియోజకవర్గంలోని వివిధ పార్టీ నాయకులతో మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా విడదల చేయడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో కొత్త ఓట్లు చేర్పుకు అవకాశం ఉందన్నారు. ఓట్ల తొలగింపుపై అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, దొప్పలపూడి జ్యోతిబాబు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే తాపత్రయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని దీనిని ప్రతి పేద కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మండల పరిధిలోని గుళ్లపల్లిలో శ్రీ నూకాలమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఎవరికైనా శస్త్ర చికిత్సలు అవసరమైతే అటువంటి వారికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు వైద్య సహాయం అందించటం జరుగుతుందన్నారు. శిబిరంలో 434 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఈవోపీఆర్డీ విజయ్ బాబు, వైద్యులు సాలేహ జుబేర్, అబ్దుల్ సమద్, శ్యామ్యుల్ ప్రదీప్, జబీర్ బాషా, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి రోజు స్వామివారిని పెళ్లి కుమారుని చేసి విశేష పూజలు చేశారు. సాయంత్రం విష్వక్సేన పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆగమ పండితులు ఎన్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఆయల కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు, సేవలు ఉంటాయని తెలిపారు. దీక్షతో వైఖానస ఆగమయుక్తంగా ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు కిరణ్‌కుమార్, నిఖిల్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరా రు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయనంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, దాతలు గుడివా డ బాలకృష్ణ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, అలపాటి వీరభద్రరావు దంపతులు, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.